క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా


రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

ప్రొద్దుటూరు: మండలంలోని చెన్నమరాజుపల్లె గ్రామ సచివాలయంలో పనిచేసే 13 మంది వలంటీర్లు ఆదివారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వచ్చాక వలంటీర్లుగా బాధ్యలు చేపట్టిన తర్వాత ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. అయితే వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయవద్దని టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో మనస్తాపం చెంది ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నామని ప్రకటించారు. రాజీనామా పత్రాలను అధికారులకు ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు లక్ష్మీనారాయణ, పవన్, శశికళ, కమల, వాణి తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ మాక్ టెస్ట్


యూపీఎస్సీ ప్రశ్నపత్రం ఆవిష్కరిస్తున్న న్యాయవాది భవ్య, జేవీవీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్: జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక, శంకర్ ఐఏఎస్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ అభ్యర్థులకు ఉచిత మాక్ టెస్ట్ నిర్వహించారు. బెంగళూరుకు చెందిన న్యాయవాది భవ్య ప్రశ్నపత్రం ఆవిష్కరించారు. నిర్వాహకులు రవిశంకర్, కిరణ్ మాట్లాడుతూ జూన్ 16న జరిగే యూపీఎస్సీ ప్రిలిమనరీ ఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులకు మాక్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతి ఆదివారం టెస్ట్‌లు నిర్వహిస్తామని చెప్పారు. పరీక్ష రాసిన వెంటనే జవాబులను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి సునీత, నాయకులు హేమలత, ఉషారాణి, రాజశేఖర్, ప్రియాంక పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి


ప్రచారం చేస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: రాష్ట్రానికి సువర్ణ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకుంటే రాష్ట్రం బాగుంటుందని పీఆర్ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జున రెడ్డి, డాక్టర్ మార్కారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముసల్‌రెడ్డిపల్లె పంచాయతీలోని కిచ్చాయపల్లె, హరిజనవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో మాజీ సర్పంచులు డాక్టర్ మాబు, లక్కినేని ఓబయ్య, బాలయ్య, నాయకులు వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, కృష్ణారెడ్డి, రామిరెడ్డి, యల్లారెడ్డి, మునిరెడ్డి, సీతారామిరెడ్డి, సుబ్బరాయుడు, ఎర్రన్న, బాలశౌరి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పోరుమామిళ్ల: అవమానించడంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సిద్దనకిచ్చాయపల్లెకు చెందిన యనమల వెంకటనారాయణ ట్రాక్టర్ తమ పొలంలో వెళ్లరాదని అదే గ్రామానికి చెందిన రంగయ్య, నారాయణ వారం రోజుల క్రితం హెచ్చరించారు. అయితే విషయం తెలుసుకున్న వెంకటనారాయణ భార్య లక్ష్మీనరసమ్మ శనివారం రంగయ్య, నారాయణ వాదనకు దిగింది. మాటమాట పెరిగి లక్ష్మీనరసమ్మపై దాడి చేశారని ఆమె మరిది శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఆమె పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సూచనల మేరకు బాధితురాలిని కడప రిమ్స్‌కు తరలించారు.

బోదకొట్టం దగ్ధం

బ్రహ్మంగారిమఠం: మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ బాకరాపేటలో పి.నారాయణ రెడ్డి బోదకొట్టం దగ్ధమైంది. ప్రమాదంలో రూ. రూ 2 లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు చెప్పారు. ఆదివారం మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జీ పుట్టా సుధాకర్‌యాదవ్ గ్రామంలో వివాహానికి హాజరయ్యారు. దీంతో ఆయన అభిమానులు టపాసులు పేల్చారు. అగ్గిరవ్వలు ఎగసిపడడంతో బోదకొట్టం అగ్నికి ఆహుతైంది. నివాస గృహం పూర్తిగా కాలిపోవడంతో రోడ్డున పడ్డామని బాధితుడు వాపోయాడు.

అన్నదానం

ప్రొద్దుటూరు: స్థానిక మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమంలో ఆదివారం అమ్మ హెల్పింగ్ హ్యాండ్ కువైట్, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వికసిత ఫౌండేషన్ సభ్యురాలు దేవిక మాట్లాడుతూ మందారం కొత్తపల్లి రవీంద్రారెడ్డి, సుబ్బలక్ష్మి తమ కుమార్తె బోజ్జిరెడ్డి పూజిత రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు.

వైభవంగా మండల పూజ

రాజుపాళెం: మండలంలోని పర్లపాడు గ్రామంలో వైభవంగా పెద్దమ్మతల్లి మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్దమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, భజన భక్తులచే భజన నిర్వహించారు.

మతితప్పి మాట్లాడుతున్న 'వరద'

- చంద్రబాబు సభ అట్టర్ ప్లాప్
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రూ.50 కోట్లతో కుందూ–పెన్నా కాలువను మంజూరు చేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అయితే ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టేందుకు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కాలువ అలైన్‌మెంట్ మార్చారని విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు విలేకరులతో మాట్లాడారు. కాలువ పూర్తికాకపోయినా ఆయన కుమారుడు కొండారెడ్డి బిల్లులు మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్‌నాయుడు కాలువ నిర్మాణానికి అడ్డు తగులుతున్నారని, కోర్టులో రైతులతో వరదరాజుల రెడ్డి కేసులు వేయించారని తెలిపారు. అప్పట్లో ఆయన మాట్లాడిన వీడియోలను మీడియా ముందు ఎమ్మెల్యే ప్రదర్శించారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం కాలువను అడ్డుకుంటోందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వయసు ప్రభావం కారణంగా ఆయన ఏమి మాట్లాడుతున్నారో, ఏమి చెబుతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవాచేశారు. నియోజకవర్గంలో పర్లపాడు, చిన్నశెట్టిపల్లె గ్రామాల్లో అప్పట్లో తవ్వని కాలువలు ఇప్పటికీ ఉన్నాయని, రైతులను ఎవరిని అడిగినా వరద నిర్వాకం బయట పడుతుందన్నారు. కేవలం ఓట్ల కోసం తమపై విమర్శలు చేస్తున్నారన్నారు.

చంద్రబాబును ప్రశ్నించిన రాచమల్లు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో చంద్రబాబు ప్రజాగళం సభ అట్టర్ ప్లాప్ అయిందని ఎమ్మెల్యే రాచమల్లు ఎద్దేవాచేశారు. చంద్రబాబు సభ కోసం డబ్బులిచ్చి జనాన్ని తరలించారని ఆరోపించారు. అయినా శివాలయం సెంటర్‌లో నిర్వహించిన సభలో ప్రజలు కనిపించలేదన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితం


వరదరాజులరెడ్డి మాట్లాడిన వీడియో చూపుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రంగు వెలసిన వస్త్రం లాంటిదని విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రొద్దుటూరుకు ఏమి చేశాడో చెప్పకుండా ముఖ్యమంత్రి జగన్‌పై, తనపై వ్యక్తిగత విమర్శలు మాత్రమే చేశారని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వంలో చెప్పుకోదగ్గ పథకం ఏమిచ్చారని నిలదీశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ వర్గానికి మేలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని గెలిపించాలని రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని రాచమల్లు సతీమణి రమాదేవి కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న 26వ వార్డులో ఆదివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వం గడపగడపకూ సంక్షేమ పథకాలను అందించిందని పేర్కొన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పాలగిరి ఖాజా, నాయకులు పాల్గొన్నారు.

రాచమల్లుకు ఘన స్వాగతం

కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి స్వగ్రామమైన కానపల్లెలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి ఆదివారం ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన బండి రమణారెడ్డి ఆదివారం గ్రామంలో పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేశారు. ఆయన ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు చోట్ల గ్రామస్తులు మాట్లాడుతూ తమకు వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబం అంటే ఇష్టమని, ప్రస్తుతం ఆయన కుమారుడు జగన్ చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా తమ గ్రామంలో ఎంతో మంది లబ్ధి పొందుతున్నారన్నారు. మొదటి నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి అండగా ఉంటున్నామని, ఎవరు పార్టీ మారినా తమకు సంబంధం లేదని, ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లెల రాజారాంరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, నందిబోయిన బాలసుబ్బయ్య, పుల్లయ్య, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, నాయకులు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, ద్వార్యల గురునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పెన్నానగర్‌కు చెందిన మాజీ సీపీఐ నాయకురాలు షేక్ మున్ని, పర్వీన్, కల్యాణ్, షరీఫ్‌తో పాటు పలువురు ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ పురోభివృద్ధికి తమ వంతు కృషి చేస్తాని వారు అన్నారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీటీసీలు అచ్చుకట్ల మహబూబ్‌బాషా, మోపూరు సుభాష్ చంద్రబోస్, కౌన్సిలర్ కమాల్, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగనన్న


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి జగనన్న అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ కొనియాడారు. ఆదివారం మండలంలోని తంగేడుపల్లె, గంగిరెడ్డిపల్లె, కుమ్మరోనిపల్లె గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలు మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని, తిరిగి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకునేందుకు ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పోరాడేందుకు అన్ని పార్టీలు ఏకమయ్యాయని, చిత్తశుద్ధిలేని పార్టీల కూటమిగా ఏర్పడినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేవని స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పేరుతో ఈ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు అబద్ధాలు చెబుతున్నారన్నారు. జగనన్న చేసిన అభివృద్ధి ప్రతిపక్షాలకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, రాష్ట్రంలో అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవరెడ్డి, రాజారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, పోలిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామిరెడ్డి, సిద్దారెడ్డి, ప్రహ్లాదరెడ్డి, వెంకటరామిరెడ్డి, రాజశేఖర్, సర్పంచ్‌లు జయరామిరెడ్డి, మునిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనరసారెడ్డి, దుగ్గిరెడ్డి, కె.తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ రామకోటి, బద్వేలు కో ఆప్షన్ మెంబర్ ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల పట్టణంలో ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి డాక్టర్ సుధను ఎమ్మెల్యేగా, అవినాష్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు జన్మభూమి కమిటీలతో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పుడు వలంటీర్లపై కక్షతో సామాజిక పెన్షన్‌లు అందకుండా చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజీవ్‌బాషా, చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు కల్లూరు రమణారెడ్డి, హనుమంతారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ అల్లా, సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు ఇస్సాక్, గురప్ప, బ్రహ్మయ్య, గంగనపల్లె రమణారెడ్డి పాల్గొన్నారు

కానపల్లెలో వైఎస్సార్‌సీపీకే మెజార్టీ

ప్రొద్దుటూరు: కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి స్వగ్రామమైన కానపల్లెలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే మెజారిటీ వస్తుందని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. ఆయన ఆదివారం కానపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ శివచంద్రారెడ్డి టీడీపీలో చేరినా గ్రామస్తులు ఎవ్వరూ ఆయనకు మద్దతు ఇవ్వలేదన్నారు. తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే అండగా ఉంటామని, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డిని గెలిపిస్తామని చెబుతున్నారన్నారు. సర్పంచ్‌గా ఎన్నికై డబ్బు సంపాదించిన శివచంద్రారెడ్డి గ్రామ ప్రజలకు చేసింది శూన్యమన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నా పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయలేని శివచంద్రారెడ్డి రామేశ్వరంలో తన సత్తా చూపుతానని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

వరద ప్రచారానికి వస్తే అడ్డుకుంటాం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి తమ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వస్తే అడ్డుకుంటామని కానపల్లె గ్రామానికి చెందిన సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రెండు ప్రైవేటు బస్సులు తమ గ్రామం మీదుగా ప్రొద్దుటూరు నుంచి గుడిపాడుకు వెళ్లేవన్నారు. తర్వాత బస్సు యజమానులు రూట్ మార్చడంతో తాము అధికార పార్టీ


మాట్లాడుతున్న ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్

ఎమ్మెల్యేగా ఉన్న వరదరాజులరెడ్డిని అప్పట్లో కలిశామన్నారు. మీ గ్రామం నుంచి బస్సులు తిప్పడం కుదరదని ఆయన స్వయంగా చెప్పడంతో గ్రామస్తులమంతా మహిళలతో కలసి రోడ్డుపై ధర్నా చేశామన్నారు. ఆ సందర్భంగా తమపై పోలీసులు కూడా కేసు నమోదు చేశారన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే ఉంటాం

తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటామని సర్పంచ్ శివచంద్రారెడ్డి టీడీపీలోకి వెళ్లడం తమకు ఇష్టం లేదని మత్స్య కాలనీకి చెందిన ప్రసాద్ రెడ్డి, షాలిన్ పీరా, చాంద్‌బాషా తెలిపారు. శివచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీలో ఉండటంతో నిన్నటి మత్స్యకాలనీ ఎన్నికల్లో ఆయన తరపున తాము ఏజెంట్లుగా కూర్చున్నామన్నారు. ప్రస్తుతం సర్పంచ్ టీడీపీలోకి వెళ్లడంతో తామంతా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిశామన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు


బ్రాహ్మణపల్లెలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

గోపవరం: మండలంలోని బేతాయపల్లె, రాచాయపేట, బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీల్లో ఆదివారం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు అన్ని గ్రామ పంచాయతీలతో పాటు రహదారుల పక్కన చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, మోశ, నిఖిత, సచివాలయ సిబ్బంది చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఘనంగా దేవర మహోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: పట్టణంలోని కోటవీధిలో ఆదివారం పెద్దమ్మ, చిన్నమ్మ తల్లి దేవర (ముద్ద) మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవార్లను తయారు చేసి కొలువు దీర్చారు. పూర్వం నుంచి ప్రతి ఏడాది ఉగాది ముందు ఆదివారం పెద్దమ్మ, చిన్నమ్మ తల్లి దేవర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవార్లను దర్శించి చల్లను సమర్పించి కోళ్లు, మేకలు, పొట్టేళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరడంతో సందడి నెలకొంది. ఆ ప్రాంతం అంతా భక్తులతో కిటకిటలాడింది. పోలీసులు అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

తల్లులకు భక్తుల నీరాజనం

పోరుమామిళ్ల: రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లో వెలసిన పోలేరమ్మ, అంకాలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం రాఘవేంద్రనగర్ భక్తులు తప్పెట్లతో, కోడిపుంజులు, మేకపోతులతో ఊరేగింపుగా వెళ్లారు. ఇద్దరు తల్లులకు బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలను చల్లగా చూడాలని, కరువు కాటకాలు లేకుండా సకాలంలో వానలు కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

చిత్ర లేఖనంతో మానసిక వికాసం

చాపాడు: చిత్రలేఖనం వలన పిల్లల్లో మానసిక వికాసం కలుగుతుందని యోగి వేమన విశ్వ విద్యాలయ చిత్రలేఖన విభాగాధిపతి మృత్యుంజయ రావు అన్నారు. స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం మూడు విభాగాల్లో 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో ఐడీపీఎస్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి జేష్టసాయి(ప్రథమ), 9వ తరగతి విద్యార్థి వెంకటకిషోర్ (ద్వితీయ), చైతన్య స్కూల్ 7వ తరగతి విద్యార్థి నిత్యశ్రీ, జూనియర్స్ విభాగంలో ఐడీపీఎస్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థి బృందసాయి (ప్రథమ), మనీషా సుంకు (ద్వితీయ), పార్వనిత్యశ్రీ (తృతీయ), సబ్ జూనియర్స్‌లో 3వ తరగతి విద్యార్థిని అనుశ్రీత (ప్రథమ), 1తరగతి అశ్రీత (ద్వితీయ), గోపికృష్ణ


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అధ్యాపకులు

స్కూల్‌కు చెందిన 3వ తరగతి విద్యార్థి తన్మయిశ్రీ (తృతీయ) గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు నగదుతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జి. శ్రీనివాసులరెడ్డి, ఐడీపీఎస్ ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్, పాల్గొన్నారు.

మెడికల్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్సీ జన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పసుపులేటి శివ కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో ఇసుకదిన్నెలకు చెందిన ఇమాంబీ అనే మహిళ అనారోగ్యంతో క్యాజువాలిటీ డాక్టర్‌ను సంప్రదించగా సరైన వైద్యం అందలేదన్నారు. దీంతో తాను సూపరింటెండెంట్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో డీసీహెచ్ఎస్, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి సరైన వైద్యం అందించాలని కోరానన్నారు. దీంతో మెడికల్ సూపరింటెండెంట్ తనను, పేషెంట్ భర్త రాజును దుర్భాషలాడారని తెలిపారు. పేషెంట్‌ను


మాట్లాడుతున్న పసుపులేటి శివకృష్ణ

ఆస్పత్రి నుంచి తీసుకెళ్లకపోతే మీ అంతు చూస్తానని బెదిరించారని, ఎవరికి ఫిర్యాదు చేసినా భయపడేది లేదని హెచ్చరించారని శివకృష్ణ తెలిపారు. సమావేశంలో పేషంట్ ఇమాంబీ, భర్త రాజు, ఎస్సీ జనసంఘం నాయకుడు విలియం పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

బ్రహ్మంగారిమఠం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం బ్రహ్మంగారిమఠంలో ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టిపల్లి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్, ఎన్నిక వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి శెట్టిపల్లె అశోక్‌రెడ్డి, ఎంపీపీ వీర నారాయణరెడ్డి, జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బి.మఠంలో కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన బి.మఠంలో మొదటిసారిగా ఎంపీ అవినాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమాపతి, భాస్కర్‌రెడ్డి, మనోహరాచారి, గాజులరామయ్య, జోగయ్య, పాలరామిరెడ్డి, దీప్తిరమణారెడ్డి, సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, లక్ష్మిరెడ్డి, రామిరెడ్డి, శ్రీను, సింగల్‌విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రిస్టఫర్ సేవలు మరువలేనివి

ప్రొద్దుటూరు: రాజుపాళెం ఎంఈఓ జీజే క్రిస్టఫర్ సేవలను మరువలేమని ఆర్జేడీ రాఘవరెడ్డి కొనియాడారు. క్రిస్టఫర్ పదవీవిరమణ సందర్భంగా ఆదివారం స్థానిక గోల్డెన్ పార్కులో సన్మానసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జేడీ ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రిస్టఫర్ తనకు మంచి మిత్రుడని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం రాజుపాళెం ఎంఈఓగా ఉన్నారని తెలిపారు. అనేక మండలాల్లో పనిచేసిన అనుభవం ఉన్న ఆయనకు విద్యాశాఖాధికారులతో విస్తృతమైన పరిచయాలు ఉన్నాయని. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఆయన ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. అనంతరం క్రిస్టఫర్, ఆయన సతీమణి సుజాతను ఘనంగా సన్మానించారు. మైలవరం ఎంఈఓ చిట్టిబాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప, ప్రొద్దుటూరు ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణితోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఎంఈఓలు, పాల్గొన్నారు.


ఎంఈఓ క్రిష్టఫర్ దంపతులను సన్మానిస్తున్న ఆర్జేడీ రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు

పునరుత్థానం.. భక్తుల ఆనందపరవశం


ప్రొద్దుటూరు కల్చరల్: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


బద్వేలు అర్బన్: ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


మైదుకూరు: దేవుని వాక్యాలు వినిపిస్తున్న పాస్టర్ అర్నిష్ బాబు

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక రామేశ్వరం సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ డాక్టర్ జాకోబ్‌ఫ్రాంక్ క్రీస్తు గొప్పతనాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన సేవ, దయ, ప్రేమ మార్గాల్లో నడవాలని తెలిపారు. క్రీస్తును శిలువ వేసిన మూడో రోజు తిరిగి ఆయన దర్శనమిచ్చిన సందర్భంగా ఈస్టర్ వేడుకలను నిర్వహించుకుంటామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలను చేసి భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు వెంకటసుబ్బయ్య, వెంకటేశు, తిమోతి, శేఖర్, చిన్నవెంకటసుబ్బయ్య, సంఘస్తులు పాల్గొన్నారు. అలాగే మైదుకూరు రోడ్డులోని ఎస్‌పీజీ-1, దొరసానిపల్లెలోని ఎస్పీజీ -3, వైఎంఆర్ కాలనీలోని గోల్డెన్ జూబ్లీ చర్చిలతో పాటు పలు చర్చిలలో క్రైస్తవులు ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మైదుకూరులో..

మైదుకూరు: మైదుకూరులో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చర్చిలతోపాటు, మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం చర్చిలో ఈస్టర్ వేడుకలను జరుపుకున్నారు. పట్టణంలోని శాంతినగర్ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ వినయ్‌కుమార్ ఏసు పునరుత్థానం గురించి వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం సీఎస్ఐ చర్చిలో పాస్టర్ అర్నిష్ బాబు పునరుత్థాన విశేషాలను సంఘ సభ్యులకు వివరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుని వాక్యాలను వినిపించారు.


చాపాడు: చియ్యపాడు సీఎస్ఐ చర్చిలో నగదు అందిస్తున్న నిర్వాహకులు

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

బద్వేలు అర్బన్: శిలువ వేయబడిన మూడవ రోజు ఏసు పునరుత్థానుడైన సందర్భంగా క్రైస్తవ సోదరులు నిర్వహించుకునే ఈస్టర్ (క్రీస్తు పునరుత్థాన దినం) పండుగను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా ఆయా చర్చిలలో క్రైస్తవ సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ చర్చిలో ఆ చర్చి డీనరీ చైర్మన్ రెవరెండ్ ఎం.ఎఫ్.ఎస్.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో, ఫాతిమా మాత చర్చిలో విచారణ గురువులు రెవ.ఫాదర్ గొడుగునూరువిజయరావు ఆధ్వర్యంలో, పునీత ఆంతోని చర్చిలో విచారణ గురువులు రెవ. ఫాదర్ లక్కినేని ఆరోగ్యరాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి ప్రెస్బిటర్ రెవ. స్వరాజ్‌జీవన్‌రావు, చర్చి సెక్రటరీ ఎడ్వర్డ్, ట్రెజరర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాపాడు మండలంలో..

చాపాడు: మండల వ్యాప్తంగా ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని చాపాడు, పల్లవోలు, చియ్యపాడు, అన్నవరం, మడూరు, అల్లాడుపల్లె, చిన్నగురువళూరు, విజయనగరం, అనంతపురం, రాజుపాళెం, మొర్రాయిపల్లె, బద్రిపల్లె గ్రామాలలోని సీఎస్ఐ చర్చిలలో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

బండలాగుడు పోటీలు

మండలంలోని చియ్యపాడు గ్రామంలో ఈస్టర్ వేడుకలను పురస్కరించుకుని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ఒంటెద్దు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు కోగటం ఓబులేసు కుమారులు రూ.10వేలు, సర్పంచ్ కోగటం ఓబులేసు రూ.8 వేలు, పుష్పరాజు రూ.6వే లు, సునీల్‌కుమార్ రూ.5 వేలు, యోహాన్ రూ.4వేలు, రాజన్న రూ.3వేలు, ఉపేంద్ర రూ.2 వేలు, గంగనపల్లె మల్లి రూ.1000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

రాజుపాళెం మండలంలో..

రాజుపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫాస్టర్లు సీమారాణి, బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీస్తు అడుగుజాడల్లో నడవాలన్నారు. శిలువ వేయబడిన మూడవ రోజు ఏసుక్రీస్తు తిరిగి లేచిన దినాన్ని ఈస్టర్ పండుగగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. మూడు రోజుల పాటు ఒక్కపొద్దు ఉన్న వారంతా ఆదివారం వడపప్పు, పానకం, పండ్లు తీసుకొని ఒక్కపొద్దును విరమించారు.

విజేతలకు సన్మానం


నర్సింగ్ ఆఫీసర్స్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం: వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లలో జాతీయ స్థాయిలో సత్తా చాటిన నర్సింగ్ ఆఫీసర్స్ బి మానస, షేక్ సూర్య ఫాతిమాలను ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టణంలోని ఎన్జీఓహోంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను ఘనంగా సన్మానించారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో నర్సింగ్ ఆఫీసర్స్‌గా పని చేస్తున్న బీ. మానస, సూర్య ఫాతిమాలు ఈ నెల 18 నుంచి 22 వరకు డిల్లీలో జరిగిన ఇండియా సివిల్ సర్వీస్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లోని 55 కేజీల క్యాటగిరి. పవర్ లిఫ్టింగ్‌లోని 52 కేజీల క్యాటగిరీల్లో మానసకు స్వర్ణపతకాలు సాధించారు. అలాగే షేక్ సూర్య ఫాతిమా వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లలోని 76 కేజీల క్యాటగిరీలో నాలుగవ స్థానంలో నిలిచారు. ఇరువురు జాతీయ స్థాయిలో విజయం సాధించి ఆదర్శంగా నిలిచారని ఎన్జీఓ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో జె. రామసుబ్బయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్ శివరామానుజ, సభ్యులు సంధ్యారాణి, జయంతి కుమారి, నాగరాజు, మహిళా విభాగం జాయింట్ సెక్రటరి సంధ్య, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి పాల్గొన్నారు.